

వెయ్యి వేసి. అప్పుడు జ్ఞాపకం వచ్చిం దతనికి తను మాట్లాడుతూన్నది ఒక సామాన్యమైన అమ్మాయితో నని.

"ఏమీ లేదు. పడుకో" అన్నాడు

పక్కకి జరిగి ఆమె అతని పక్కనే తనూ పడుకొని, అతని మీద చెయ్యి వేసింది. అతనన్నాడు:

"చూడూ, మనసులో ఒక భావం ఉంచుకొని పైకి ఒకలా మాట్లాడే మనిషిని కాను నేను. నా మనసులో ఒక భావం ఏర్పడింది. ప్రేమకి క్లైమాక్స్ సెక్స్ అని! దాన్ని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను నేను. అందువల్ల నువ్వు నా ముందు నగ్నంగా నిలబడినా నా కేమీ స్పందన కలగదు. ఇలాటి చీప్ ట్రిక్స్ ఏమీ నా మీద ప్రయోగించక. శుభ్రంగా నిద్రపో, రేపు పొద్దున్న వాడొచ్చి తలుపు తీసేవరకూ."

వసంత నవ్వుతూ అతని చేతులు పట్టుకొని, "ఇప్పట్నుంచి నాకో అన్నయ్య. . ." అంటూ ఏదో చెప్పబోయింది

"మా డ్రామా హీరోయిన్సుకి ఇలాగే ఏమీ అభ్యంతరం లేకే! ఎందుకో అగ్ని వంటిదనే? ఇద్దరి మధ్య సెక్స్ లేనంత మాత్రాన అన్నా చెల్లెళ్ళయిపోతారా? రేపు పొద్దున్న నీ గురించి ఎవరన్నా అసహ్యంగా మాట్లాడితే నడిబజార్లో నా చెల్లిని అని అంటున్నందుకు వాళ్ళ కొట్టాలా నేను? ఎవర్ని పడితే వాళ్ళని చెల్లెలుగా నే నొప్పుకోను. క్షమించు. గుడ్నైట్" అన్నాడు పక్కకి తిరుగుతూ.

* * *

"నీ అంత పరమ స్కౌండ్రల్ మరియు ఇడియట్ ఈ లోకంలో ఇంకెవరూ ఉండరు" అన్నాడు శాస్త్రి. పి.ఏ మాట్లాడలేదు. శాస్త్రికి అనుమానం ఏదో వచ్చి, "అసలు నువ్వు చెబుతోంది అంతా నిజమేనా?" అన్నాడు.

పి.ఏ నవ్వి, "నిజమే" అన్నాడు.

"వెధవా! అనవసరంగా మంచి ఛాన్సు వేస్ట్ చేసేవు కదా!" అన్నాడు నిట్టూర్చుతూ. పి.ఏ మౌనంగా ఉండిపోయేడు. అంతలో క్రితం రాత్రి తాలూకు సంభాషణ జ్ఞాపకం వచ్చి అతని పెదవుల మీద నవ్వు విరుస్తూ మెరిసింది. అది గమనించి శాస్త్రి "ఎందుకు నవ్వుతున్నావ్?" అని అడిగేడు.

పి.ఏ నవ్వేసి, "ఏమీ లేదు. ఆ అమ్మాయి నిన్న రాత్రి నన్ను అన్నయ్య అనేసింది. ఆడవాళ్ళు ఎంత తొందరగా బాంధవ్యం చేసుకుంటారో చూశావా" అన్నాడు.

శాస్త్రి కిటికీలోంచి బయటికి చూస్తూ క్షణం ఆలోచించి, "అందులో తప్పుందని అనుకోను" అన్నాడు.

